


కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న ఉట్టి కార్యక్రమం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

ఆదివారం 17 ఆగస్టు 2025

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాలో ముకుందుడి ఆలయాలు కిక్కిరిశాయి. భక్తులు దర్శనం చేసుకుని పూజలు చేశారు. తమ చిన్నారులను కన్నయ్య, గోపిక వేషాలను వేసి పెద్దలు మురిసిపోయారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పెద్దపట్నం వేసి, ఉట్టి వేడుకను నిర్వహించారు.





ఇర్కోడు రుక్మిణీ సత్యబామ ఆలయంలో స్వామివారు, దర్శనం చేసుకుంటున్న భక్తులు

కృష్ణాష్టమి వేడుకల్లో జగ్గారెడ్డి జోష్

భార్య నిర్మల, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తు, స్థానికులతో కలిసి రాంమందిర్ వద్ద ఉట్టికొట్టిన జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకొని సంగారెడ్డి రాంమందిర్ కమాన్ వద్ద శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ముందుగా రాంమందిర్ నుంచి కమాన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కమాన్ వద్ద తన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తుసాయి రెడ్డి, బంధువులు, స్థానికులతో కలిసి ఉత్సాహంగా జగ్గారెడ్డి ఉట్టికొట్టారు. డీజే పాటల నడుమ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు.






గజ్వేల్ రేక్ పాయింట్‌ను పునరుద్ధరించాలి

ఇక్కడి యూరియా కోటాను హుస్నాబాద్‌కు మళ్లించారు

సరిపడా అందించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

7



మన్‌సాన్‌పల్లి రూటే సపరేటు

7

దశాబ్దాలుగా మౌలిక వసతులు కరువు

తాగడానికి సురక్షిత నీరు లేదు.. కరెంట్ సరఫరా సరిగా ఉండదు

బస్సు సౌకర్యమూ కల్పించని వైనం

చేర్యాలలో క్షుద్రపూజల కలకలం

6

ఓవైపు సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యూరియా వినియోగం అత్యవసరమైంది. సరిపడా నిల్వలు లేక పోవడంతో రైతులకు ఒకట్రెండు బస్తాలు అంటగట్టి వ్యాపారులు చేతులు దులుపు కుంటున్నారు. గంటల కొద్దీ వర్షంలో నిలబడినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళన బాటపడుతున్నారు. అనుకున్న స్థాయిలో యూరియా దిగుమతి కాలేదని ఇటు అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. ఉన్నతాధికారులైనా చొరవ చూపించి రైతులను శాంతింప చేస్తారనుకుంటే అదీలేదు.



రాయపోల్‌లో వర్షంలోనూ యూరియా కోసం వేచిచూస్తున్న రైతులు

యూరియా బాధలు రైతుల బారులు

వర్షంలోనూ ఎరువుల దుకాణాల ఎదుట నిరీక్షణ

వరుస వర్షాలతో యూరియా అత్యవసరం

ముందస్తు చర్యల్లో యంత్రాంగం విఫలం

చేతులెత్తేసిన వ్యాపారులు, అధికారులు



అక్కన్నపేటలోని సొసైటీలో బారులు తీరిన రైతుల

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	అవసరం	కేటాయింపు
సంగారెడ్డి	36,780	29,892
సిద్దిపేట	40,000	20,896
మెదక్	26,000	19,000

సిద్దిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాల్లో వారం రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఈ సమయంలో యూరియా చల్లాల్సి ఉంటుంది. పంటల పచ్చదనంతోపాటు మొక్కల ఎదుగుదలకు యూరియా అవసరం ఉంది. కానీ ఇందుకు సరిపడా యూరియా నిల్వలను జిల్లాలకు తెప్పించడంలో విఫలమయ్యారు. అందుకే ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండడం వల్ల అంతగా సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. సిద్దిపేట, మెదక్ జిలాల్లో అధికారులు విఫలమవడంతో అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు.

భారీ వర్షంలోనూ తప్పని తిప్పలు

భారీ వర్షానికి సైతం వెరవకుండా రైతులు యూరియా కోసం బారులు తీరుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో

మిగతా 7వ పేజీలో

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

ఉమ్మడి మెదక్ జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు లేవని, అప్రమత్తం కాకుంటే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంటుందని ఈనెల 4న 'యూరియా కావాలయ్యో' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం యూరియాపై దృష్టి పెట్టాలని సూచించడం జరిగింది. కానీ ఆశించినస్థాయిలో నిల్వలు దిగుమతి కాలేదు. ఫలితంగా ఈ పరిస్థితి తలెత్తింది.



గజ్వేల్ సొసైటీ ఎదుట స్టాకు లేదని బోర్డు

ఆర్మీ జవాన్ ఆచూకీ కోసం చొరవచూపండి

బండి సంజయ్‌ను కలిసిన కుటుంబసభ్యులు

కొమురవెల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం అయినపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తోట అనిల్ పంజాబ్ రాష్ట్రంలోని అంబలాలో అదృశ్యమై తొమ్మిది రోజులు గడుస్తున్నా ఆచూకీ తెలియకపోవడంతో అతని కుటుంబం ఆందోళన చెందుతోంది. ఈమేరకు అనిల్ ఆచూకీ తెలుసుకునేందుకు చొరవ చూపాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో అనిల్ భార్య అనూష, తల్లి మంగమ్మ, కుటుంబ సభ్యులు శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన బండి సంజయ్ అక్కడి అధికారులతో మాట్లాడి అనిల్ ఆచూకీని కనుక్కునే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప, నాయకులు ఉన్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవిస్తున్న అనిల్ కుటుంబసభ్యులు

కోహెడ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గైర్హాజరైన సిబ్బందిపై చర్యలకు ఆదేశం

కోహెడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కలెక్టర్ కె.హైమావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల హాజరు రిజిస్టర్, ఇన్‌పేషెంట్ రిజిస్టర్, ఆరోగ్య మహిళ, వ్యాక్సినేషన్ వంటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ తనిఖీ సమయంలో, ఎలాంటి సెలవు మంజూరు లేకుండానే గైర్హాజరైన సిబ్బంది విజయ, సతీష్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని (డీఎంహెచ్‌వో) ఆదేశించారు. అదేవిధంగా మెడికల్ లీవ్‌లో ఉన్న ఆయుష్ డాక్టర్ కిరణ్ కుమారిపై కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్దూరు పీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన స్టాఫ్‌నర్సు పూజ డిప్యూటేషన్ రద్దు అయినా కోహెడలోనే విధులు నిర్వహిస్తుండటంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ మహమ్మద్ సమీర్‌ఖాన్, ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు ఉన్నారు.





పొంగిపొర్లుతున్న నంగునూరు మండలం అక్కెనపల్లి పెద్దవాగు, మత్తడి దూకుతున్న నర్సాపూర్ చెరువు

ముసురేసింది

జిల్లాలో మోస్తరు వాన

చెరువులకు జలకళ

సిద్దిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను ముసురు వాన కమ్మేసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. సిద్దిపేట పట్టణంలో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిన్నకోడూర్ మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలో రెండు పెంకుటిల్లులు పాక్షికంగా కూలిపోయాయి. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చెరువు నిండి మత్తడి దూకుతున్నది. సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామంలోని చెరువు నిండుకుండలా మారింది.

ములుగులో అత్యధికంగా..

జిల్లాలో గరిష్ఠంగా ములుగు మండలంలో 30.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నారాయణరావుపేట మండలంలో 14.8 మి.మీ., అక్బర్‌పేట-భూంపల్లి

మిగతా 8లో

అంతకుమించి..

సిద్దిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత నెలాఖరు వరకు అడదడపా వానలతో ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షాపాతం నమోదవగా, వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అధికంగా నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని వాగులు పొంగిపొర్లుతుండగా చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పాత ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు అయిన సింగూరుకు వరద పోటెత్తగా, ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా పుల్కల్, చౌటకూరు మండలాల్లో 80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా మెదక్ జిల్లా టేక్మాల్, శివ్వంపేట, పెద్ద శంకరంపేట, నర్సాపూర్, మనోహరాబాద్ మండలాల్లో 60 నుంచి 100 మిల్లీమీటర్లు కురిసింది. సిద్దిపేట జిల్లాలోనూ గడిచిన 15 రోజుల్లో 84 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం కురిసింది.

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

జిల్లా	కురియాల్సింది	కురిసింది
సిద్దిపేట	375.1	491.0
సంగారెడ్డి	408.7	461.2
మెదక్	423.1	507.1



నిండుకుండలాగా మారిన ఎన్సాన్‌పల్లి చెరువు



సిద్దిపేట పట్టణంలో వర్షానికి జలమయమైన రోడ్డు

అటకెక్కిన అప్‌గ్రేడేషన్

సిబ్బంది కొరతతో మార్కెట్ కమిటీలు కుదేలు

ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్న ఫైల్

ఖాళీగా ఉన్న పోస్టులు, సిబ్బందిపై పెరుగుతున్న పనిభారం



గజ్వేల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బందిలో నిరాశ నెలకొంది. సిద్దిపేట జిల్లాలో మొత్తం 14 మార్కెట్ కమిటీలు ఉండగా అందులో ప్రస్తుతం సిద్దిపేట మార్కెట్ కమిటీ మాత్రమే స్పెషల్ గ్రేడ్‌గా కొనసాగుతుండగా, మిగిలినవి గ్రేడ్-1, గ్రేడ్-2 స్థాయిలోనే ఉన్నాయి.

మార్కెట్ కమిటీల ఆదాయం

జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ప్రతి ఏటా వ్యవసాయ, ఇతర ఉత్పత్తుల

మిగతా 8లో



నాలుగు తరాల ఆత్మీయ కలయిక

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన ఆరుగురు అన్నదమ్ములైన బొందుగుల సాయిలు, రాజమల్లయ్య, మల్లేశం, రామస్వామి, చంద్రయ్య, నర్సయ్య కుటుంబాలకు చెందిన నాలుగు తరాల వారు దాదాపు 100 మంది శనివారం ఆత్మీయ కలయికలో కలుసుకున్నారు. - చేర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి)

యూట్యూబ్ చూసి దొంగతనాలు

మెదక్ అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈజీ మనీకి అలవాటు పడిన ముగ్గురు స్నేహితులు బ్యాంకులు, ఏటీఎంలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీలు ఎలా చేయాలో యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఈ నెల 7న మెదక్ పట్టణంలోని ఆటోనగర్ ఎస్‌బీఐ బ్యాంకులో దొంగతనానికి యత్నించిన కేసులో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి విచారించగా.. పలు చోట్ల చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, లింగం, ప్రసాద్ ముగ్గురు కలిసి గత జూన్‌లో గుమ్మడిదల ఎక్స్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లి ట్రాక్టర్‌కు తాడు కట్టి దొంగతనం చేయడానికి యత్నించారు. అలారం మోగడంతో అక్కడి నుంచి పారిపోయారు. జూన్ 30న వెల్దుర్తిలోని సెంట్రల్ బ్యాంకు గోడను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి, చోరీకి ప్రయత్నించగా.. అలారం మోగింది. దాంతో దొంగలు పారిపోయారు. ఈనెల మొదటి వారంలో గుమ్మడిదలలోని భవానీ వైన్స్ గోడకు రంధ్రం చేసి లోనికి వెళ్లి మద్యం బ్యాటిళ్లతోపాటు రూ. 15 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈనెల 7న మెదక్ పట్టణంలోని ఆటోనగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులోకి వెళ్లి లాకర్ గోడను పగలగొట్టేందుకు ప్రయత్నించి విఫలం కావడంతో వెళ్లిపోయారు. అదే రోజు కొడిపల్లిలోని వైన్స్ షాపుకు రంధ్రం చేసి మద్యం బాటిళ్లు దొంగతనం చేశారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుత్తి, గడ్డపార, శానాం, తాడు, సంచులు, బైకులు, ట్రాక్టర్, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. పేరూర్ గ్రామానికి చెందిన ఫక్రొద్దీన్ ఈనెల 4న గోల్కొండ కాలనీలో పార్కు చేసిన ఆటోను ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసుల సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా డిచ్‌పల్లి శివారులో ఆటోను గుర్తించారు. దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులను ఛేదించిన పట్టణ సీఐ మహేష్, ఎస్సై అమర్, కొడిపల్లి ఎస్సై రంజిత్ రెడ్డి, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

చేర్యాలలో క్షుద్రపూజల కలకలం



దుకాణ ఆవరణలో చేసిన క్షుద్రపూజ

చేర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు చేర్యాల పట్టణంలో కలకలం రేపింది. మండలకేంద్రానికి చెందిన గాజుల నాగరాజు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. రోజూవారీలాగే శుక్రవారం రాత్రి షాపుమూసి వేసి షటర్‌కు తాళంవేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం షాపు తెరవడానికి వచ్చిన అతడికి షాపు ఆవరణలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడిగుడ్లు, నలుపురంగు బొమ్మ, అన్నం మధ్యన నాగరాజు దంపతుల ఫోటో కనిపించడంతో ఖంగుతిన్నాడు. క్షుద్ర పూజలు చేశారని అర్థమై చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయం అంతటా వ్యాపించడంతో చుట్టుపక్కలవారితో పాటు స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

కస్టమర్‌కేర్ అనుకుని కాల్..

80వేలు పోగొట్టుకున్న యువకుడు

నర్సాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌కు చెందిన కలీల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వస్తువు కొనుగోలు చేశాడు. అది రాకపోవడంతో వెబ్‌సైట్‌లో నెంబరు చూసి ఫోన్ చేయగా వారు మోసం చేసి ఫోన్‌లో ఉన్న సుమారు 80వేల రూపాయలు కాజేసిన వైనం చోటు చేసుకుంది. శనివారం ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవించే కలీల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వస్తువు కొనుగోలు చేయగా అది రాకపోవడంతో వెబ్‌సైట్‌లో ఉన్న నెంబరుకు ఫోన్ చేసి విషయం చెప్పగా మళ్లీ అప్‌డేట్ చేయాలి మీ వివరాలు అని చెప్పగా వివరాలు చెప్పిన తర్వాత ఫోన్‌కి వచ్చిన ఓటీపీకి ఓకే చేశాడు. అంతే పలుమార్లు అతడి అకౌంట్‌లో ఉన్న మొత్తం సుమారు రూ.78,294 ఖాళీ చేశారు. అనుమానం వచ్చి అకౌంట్‌లో బ్యాలెన్సు చూడగా విషయం బయటపడటంతో 1930సైబర్‌క్రైంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్యాంకుపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలిద్దరు గొడవపడి భర్త ఓవర్‌హెడ్ ట్యాంకుపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డిజిల్లా మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణ(35) తాగినమైకంలో కుటుంబ సభ్యులతో గొడవపడి శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కోల్కుందకు చెందిన క్రిష్ణ కొంతకాలంగా భార్య సత్యమ్మతో కలిసి మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో భార్య, కుటుంబసభ్యులు పలుమార్లు తాగొద్దంటూ మందలించినా మార్పురాలేదు. శుక్రవారం రాత్రి తాగినమత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంపక్కనే ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి కిందకు దూకాడు. దీంతో గ్రామస్థులు, కుటుంబీకులు జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య సత్యమ్మ ఫిర్యాదుమేరకు మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేందర్‌రెడ్డి అన్నారు.

కుమారుడితో సహా గృహిణి అదృశ్యం



రాథోడ్‌శాంతాభాయి (ఫైల్)

పటాన్‌చెరు ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పని చేసుకొని బ్రతుకుతామంటూ ఓ గృహిణి కుమారుడుతో అదృశ్యం అయింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ శాంతాభాయి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటుంది. భర్త రవి రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి పని చేసుకుంటున్నాడు. గత నెల 27న తెల్లవారు జాము సమయంలో సొంత గ్రామంలో పని చేసుకుని బ్రతుకుతామంటూ ఇంటి యజమానికి చెప్పి ఇల్లు ఖాళీ చేసి కుమారుడు నితిన్‌తో కలిసి అదృశ్యం అయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో శనివారం అక్క లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సింగూరుకు పర్యాటకుల తాకిడి




పుల్కల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో శనివారం పర్యాటకుల సందడి పెరిగింది. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం కృష్ణాష్టమి, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రాజెక్టును చూడటానికి వచ్చారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల పట్టణాల నుంచి వాహనాల్లో వచ్చారు. పర్యాటకులు ప్రాజెక్టుపైకి వెళ్లడానికి అనుమతి లేకపోవడంతో మంజీర నదిపై వంతెన వద్ద నిలబడి దిగువకు వెళ్తున్న వరద నీటిని చూసి ఆనందించారు. వంతెనపై నిలబడి సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ప్రవాహం పెరగడంతో మరిన్ని గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ ప్రాజెక్టును సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పర్యాటకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేదిలేదన్నారు.

దుకాణాల్లోనే సిట్టింగ్..

ప్రాజెక్టు వద్ద చేపల ఫ్రై దుకాణాలు కిటకిటలాడాయి. సింగూరు చేపలు ఇష్టపడే పర్యాటకులు అక్కడే చేపలు కొనుగోలు చేసి వేయించుకుని తిన్నారు. కొన్ని దుకాణాల్లో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నారని, అధిక ధరలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. చేపల వేపుడు దుకాణల్లోనే సిట్టింగ్ ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నారు.



మొక్కజొన్న కంకుల వద్ద పర్యాటకులు







మన్‌సాన్‌పల్లి రూటే సపరేటు!

● తాగడానికి సురక్షిత నీరు లేదు.. కరెంట్ సరఫరా సరిగా ఉండదు
● బస్సు సౌకర్యమూ కల్పించని వైనం

దశాబ్దాలుగా మౌలిక వసతులు కరువు

కొండాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా ఇప్పటికీ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామానికి కనీస సౌకర్యాలు అందని దుస్థితి నెలకొంది. ఏళ్ల కొద్ది తాగునీరు, విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. విద్యాభ్యాసం, బస్సు రవాణా తదితర అవసరాలకు జిల్లా, మండల కేంద్రాలకే వెళ్లాల్సి వస్తున్నది. గ్రామానికి ఇప్పటి వరకు నేరుగా బస్సు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. రాష్ట్ర రాజధానికి వెళ్లే దారి పక్కనే, మహానగరానికి కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ గ్రామానికి వసతులు అందడం లేదు.

నీళ్లు, కరెంట్, బస్సు సౌకర్యాలు నిల్

జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్లు, మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామానికి ఉత్తరాన హైదరాబాద్ వెళ్లే రోడ్డు ఉంది. గ్రామంలో 368 కుటుంబాలు, 984 ఓటర్లు, 1500 జనాభా ఉన్నారు. 365 ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు, 84 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామంలోని వ్యవసాయ భూములకు విపరీతమైన ధర ఉన్నప్పటికీ, ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలు అందడంలేదు.

ఈ దారే సపరేటు

మన్‌సాన్‌పల్లి నుంచి మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ముందుగా హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిని, రెండు కిలోమీటర్ల మేర రంగారెడ్డి జిల్లా సరిహద్దులను దాటాల్సిందే. ఇప్పటి వరకు గ్రామం నుంచి మండల కేంద్రంలోని గ్రామాలను కలుపుతూ జిల్లా కేంద్రానికి బస్సు రవాణా సౌకర్యం కల్పించలేదు. రైతులు వ్యవసాయ విత్తనాలు, మందులు, ఎరువులకు, బ్యాంక్ రుణాలకు, మహిళా సంఘాల సభ్యులు మండల కేంద్రానికి తప్పనిసరిగా రావాల్సిన పరిస్థితి. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం నడవాలి లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

ఏళ్లుగా సురక్షిత నీటికి పడిగాపులు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన మంజీరా నీటి పథకం, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ పథకాలు ఇంతవరకు గ్రామానికి అందలేదు. వికారాబాద్ జిల్లాకు సరఫరా అయ్యే కృష్ణానది జలాల పైపులైన్ ఈ గ్రామ పరిసరాల నుంచే వెళుతోంది. రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణా జలాల లిఫ్టింగ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ సైతం అందుబాటులో ఉంది. అయినా గ్రామానికి చుక్క నీరు అందని పరిస్థితి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

గ్రామంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండటం లేదు. గ్రామానికి సంబంధించిన ఒక కనెక్షన్ కూడా మండల, జిల్లా పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందడం లేదు. ఇంటి అవసరాలకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి నుంచి, వ్యవసాయానికి నవాబ్‌పేట, మొమినాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అవుతుండగా, బిల్లులు మాత్రం కొండాపూర్ విద్యుత్ అధికారులు వసూలు చేస్తారు. దీంతో సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ఒకరిపై ఒకరు సాకులు చెప్పడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పేరుకే నిరంతర విద్యుత్ సరఫరా ఉందని, రాత్రి, పగలు అనే తేడా లేకుండా రెండు మూడు రోజుల పాటు విద్యుత్ ఉండటం లేదని, బిల్లులు మాత్రం పక్కాగా వసూలు చేస్తున్నారని మాజీ సర్పంచ్ అనిత నర్సింహులు తెలిపారు. మంజీరా, మిషన్ భగీరథ నీటి కోసం రూ. 2 లక్షల సొంత నిధులు ఖర్చు చేసి పైపులు వేసినా ప్రయోజనం లేకుండా పోయిందని మరో మాజీ సర్పంచ్ వెంకటమ్మ తెలిపారు.

చెరువుల చెంత పైలం

● ఈత సరదా కారాదు విషాదం ● లైఫ్ జాకెట్‌లు వాడటం ఉత్తమం ● ఒంటరిగా ఈతకు వెళ్లకూడదు




మెదక్ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు జీవకళ వచ్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పోచారం అభయారణ్యం పక్కనే ఉన్న పోచారం ప్రాజెక్టు నిండు కుండలా మారింది. దీంతో సెలవులు దొరికితే చాలు విద్యార్థులు, పెద్దలు చాలామంది చెరువులు, ప్రాజెక్టుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడే రోజంతా సరదాగా ఆటపాటలతో గడిపేస్తూ విందు భోజనాలు చేస్తున్నారు. ఈ ఆనందాల వెనుక ప్రమాదం పొంచి ఉన్నది. ఈతకు వెళ్లి గల్లంతవడం, వరదలో కొట్టుకుపోవడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ తరుణంలో కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

మద్యం సేవించి ఈతకు వెళ్లకూడదు...

నీటి వద్దకు వెళ్లేటప్పుడు గానీ, ఈత కొట్టేటప్పుడు గానీ మద్యం సేవించి ఉండకూడదు. నీరు ఎక్కువ లోతు లేకపోయినప్పటికీ ఆల్కహాల్ సేవించి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చల్లని నదులు లేదా ప్రవాహాలలో ఈత కొట్టకూడదు.

లైఫ్ జాకెట్‌ను ధరించాలి...

ఈత కొట్టాలనుకున్నప్పుడు కచ్చితంగా లైఫ్ జాకెట్‌ను ధరించడం మంచిది. పిల్లలైనా, పెద్దలైనా లైఫ్ జాకెట్ ఉండేలా చూసుకోవాలి.

ఒంటరిగా వద్దు..

ఒంటరిగా ఈత కొట్టకూడదు. ఈత తెలిసిన వారు మీ బృందంలో ఉండాలి. లైఫ్ గార్డు ఉన్న నిర్దేశిత ఈత ప్రాంతాలలో మాత్రమే ఈత కొట్టాలి. ఎక్కువ దూరానికి గానీ, ఎక్కువ లోతులో ఈత కొట్టడానికి ప్రయత్నించకండి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

వీలైనంత వరకు కొత్త చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు, బావులలో ఈత కొట్టకపోవడమే ఉత్తమం. తప్పనిసరిగా ఈత వచ్చిన వారే ఈతకు వెళ్లాలి. ఈత మానేసిన చాలా రోజుల తర్వాత ఈత కోసం దిగకూడదు, దీంతో దమ్ము, ఆయాసంతో ఊపిరి ఆడదు. ఈత కోసం దిగే వారు అక్కడి లోతు తదితర విషయాల పట్ల పూర్తి అవగాహన ఉంటేనే దిగాలి. ఈత కోసం దిగితే నీటి ఒడ్డున ఒకరు ఉండేలా చూసుకోవాలి. ఈత కోసం వాడే గాలి ట్యూబ్‌లు, తదితర పరికరాలు వాడటం మంచిది. ఎత్తైన ప్రదేశం నుండి నీటిలో దూకడం లాంటివి చేయకూడదు.

ఇతరులను కాపాడేటప్పుడు..

ఒకవేళ ఎవరైనా నీటిలో మునిగిపోతుంటే వారికి చేతులు అందించకూడదు. ఏదైనా తాడు, కర్ర వంటి వాటితో కాపాడే ప్రయత్నం చేయాలి. గాలంతో చేపలు పట్టే వారు గాలం చిక్కుకుందని నీటిలో దిగడం లాంటివి చేయకూడదు. అక్కడ లోతుగా ఉన్నట్లయితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

శ్రీవారి ఆలయం వద్ద భక్తుడికి గుండెపోటు

● సీపీఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించి సీపీఆర్ చేసి ఓ భక్తుడిని రక్షించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మామిడిపల్లికి చెందిన మేడం శ్రీనివాసులు(61) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం రాత్రి 9.30 గంటల సమయంలో లడ్డూలు కొనుక్కుని మ్యూజియం వైపు వస్తున్న క్రమంలో పడమర మాడవీధిలో ఛాతీనొప్పితో కుప్పకూలిపోయారు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ గుర్రప్ప ఆయనకు సీపీఆర్ చేయడంతో కోలుకున్నారు. వెంటనే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

గజ్వేల్ రేక్ పాయింట్‌ను పునరుద్ధరించాలి

● ఇక్కడి యూరియా కోటాను హుస్నాబాద్‌కు మళ్లించారు
● సరిపడా అందించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం
● ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ రేక్ పాయింట్‌ను పునరుద్ధరించి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతాంగానికి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ వద్ద రాజీవ్ రహదారిపై శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేక్ పాయింట్‌ను తొలగించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గజ్వేల్ యూరియా కోటాను హుస్నాబాద్‌కు తరలించారని విమర్శించారు. రైతుల సమస్యలపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఇతర ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గజ్వేల్‌లో రేక్ పాయింట్‌ను పునరుద్ధరించకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ధర్నా జరుగుతున్న స్థలానికి వచ్చిన సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి మాట్లాడుతూ, గజ్వేల్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా తరలించలేదని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ధర్నా విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా, రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డీసీసీబీ డైరెక్టర్ భట్టు అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, ఊడెం కృష్ణారెడ్డి, మాదాసు శ్రీనివాస్, జకీ, నవాజ్‌మీరా, రమేష్, దుర్గయ్య, నూనె కుమార్, దేవి రవీందర్, దుర్గాప్రసాద్, బొల్లారం ఎల్లయ్య, పంగ మల్లేశం, యాదగిరి, లక్ష్మణ్‌రాజు, కోల సద్గుణ, అత్తెల్లి శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, అహ్మద్, కనకయ్య, కొల్గూరు స్వామి, నరేశ్‌గౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



చేగుంటలో రైతు ఆగ్రో సేవా కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

యూరియా బాధలు.. రైతుల బారులు

(5వ పేజీ తరువాయి)

నెలకొన్నది. కొన్నిచోట్ల ఉదయం 5 గంటల నుంచే ఎరువుల దుకాణాలు, సొసైటీల ఎదుట రైతులు తమ చెప్పులను క్యూలైన్లలో ఉంచుతున్నారు. వర్షాలు లేని చోట స్వయంగా రైతులే గంటల తరబడి నిల్చుంటున్నారు. ఆధార్ కార్డు, పాస్‌బుక్ ఆధారంగా ఎకరాకు ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. కొన్ని చోట్ల ఒక్కో యూరియా బస్తాపై రూ.50 నుంచి రూ.100దాకా వసూలు చేస్తున్నారు. వర్షం ఎత్తిపోతే యూరియాతో ఉపయోగం ఉండదని భావించి ఈ సమయంలోనే యూరియా కోసం శ్రమిస్తున్నారు.

ఆలస్యమైతే అంతేసంగతి..

యూరియా చల్లడం ఆలస్యమైతే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అందుకే యూరియా కోసం ఆరాటపడుతున్నారు. కాగా యూరియాపై రైతులకు సరైన అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం ఉంది. విడతల వారీగా యూరియా వస్తుందని, కృత్రిమ కొరత లేదని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. అందుకే వరి పంటకు రెండో దఫా యూరియా వినియోగం కోసమూ ఇప్పటి నుంచే రైతులు తీసుకెళ్తున్నారు. ఫలితంగా ఈసారి యూరియా అవసరం ఉన్నవారికి నిరాశ తప్పడం లేదు. ఇలాంటివాళ్లే రోడ్డెక్కుతూ ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు యూరియా చల్లకుంటే పంటలు ఎర్రబారుతాయని, దిగుబడి తగ్గుతుందని ఎవరికివారే రైతులు భావిస్తున్నారు. ఇందులో నిజనిజాలపై అధికారులు చైతన్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్యూలో పడిగాపులు

చేగుంట/ వెల్దుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియా అవసరముండటంతో చేగుంట రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఇబ్రహీంపూర్ సొసైటీ వద్ద శనివారం రైతులు క్యూలైన్లలో నిల్చున్నారు. చేగుంటలోని శ్రీ ఆంజనేయ ఆగ్రో సేవా కేంద్రానికి 225 బ్యాగులు, ఇబ్రహీంపూర్ సొసైటీకి 560 బ్యాగుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న చేగుంట చుట్టుపక్కల గ్రామాలు, ఇబ్రహీంపూర్ సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే వెల్దుర్తిలోని సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. రైతుల పట్టా పాసుపుస్తకాలు పరిశీలించి వారికి సరిపడా యూరియా బస్తాలను విక్రయించినట్లు సొసైటీ సీఈఓ అశోక్ తెలిపారు. మండలంలో 560 బస్తాల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

● ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న రాచమల్ల సిద్దేశ్వర్

మెదక్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులు గెలిచేందుకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్(ఆర్‌జీపీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లోని ఓ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీని బలోపేతం చేయడానికి గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కోరారు. కంప్యూటర్ విప్లవం తెచ్చింది రాజీవ్ గాంధీ అని తెలిపారు. సంఘటన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుభాష్ యాకరణ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ఆర్‌జీపీఆర్ఎస్ నిర్మాణంతో లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్ ముగబాసే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, టీపీసీసీ నాయకులు సుప్రభాత్‌రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మహేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, యువజన కాంగ్రెస్ నేత బొజ్జ పవన్ కుమార్ సమీయొద్దీన్, గూడూరి శంకర్, గూడూరి క్రిష్ణ, హఫీజొద్దీన్, లక్ష్మీనారాయణ్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.



సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో వేడుకలు





రాయపోల్, చిన్నకోడూరు మండలకేంద్రాల్లో చిన్నికృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు





దుబ్బాక: గాయత్రి వివేకానంద విద్యాలయం, ఆర్యవైశ్యభవనంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



హుస్నాబాద్: పార్థసారధి గీతామందిర్ ఆధ్వర్యంలో కోలాటాలు

అలరించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, తులసి దళాలతో అర్చన, పుష్ప, క్షీర, జలాభిషేకాలు నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయాల్లో భక్తులు శ్రీలలితా, విష్ణు సహస్ర నామ పారాయణాలు భక్తిశ్రద్ధలతో చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. సంప్రదాయబద్ధంగా ఉట్లు కొట్టే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాలల్లో చిన్నారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల కృష్ణుడి ఉత్సవ విగ్రహంతో ప్రధాన వీధుల్లో మహిళల కోలాటాలు, భజన కీర్తనలు, ఊరేగింపుతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది.

- న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)





సిద్దిపేట శ్రీకృష్ణ సుందర సత్సంగంలో విశేషాలంకరణలో స్వామివారు, జన్మాష్టమి వేడుకలకు హాజరైన భక్తులు





బెజ్జంకి: గాగిల్లాపూర్ ధ్యాన నిష్ట ఆశ్రమంలో పూజలు, చేర్యాలలో శ్రీకృష్ణుడు, గోపిక, గొల్లభామల వేషధారణలో చిన్నారులు

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ



అఖిల పక్షం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

మద్దూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాలను రెవెన్యూ డివిజన్ డిమాండ్‌తో ఈ నెల 25న దుద్దెడ జాతీయ రహదారిపై నిర్వహించే రాస్తారోకోను జయప్రదం చేయాలని మద్దూరు, ధూళిమిట్ట జేఏసీ ఇన్‌చార్జి మలిపెద్ది మల్లేశం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మల్లేశం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో అఖిల పక్షం ఆధ్వర్యంలో 200 బైక్‌లతో జేఏసీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మద్దూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వకులాభరణం నర్సయ్య పంతులు, బాల్‌నర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మేక సంతోష్, బద్దిపడిగె కృష్ణారెడ్డి, మంద యాదగిరి, పుట్ట వెంకట్‌రమణారెడ్డి, నాంపల్లి చంద్రశేఖర్, వెంకట్‌మావో,బూర్గు సురేష్, ఆలేటి యాదగిరి, వంగ బాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి



గజ్వేల్ టీపీటీఎఫ్ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాగార్డెన్స్‌లో ఈ నెల 24న టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యా సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏడెల్లి రాంచంద్రం పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాసదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఖాసీం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ప్రొఫెసర్ కోదండరాంలు హాజరవుతున్నారన్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని ఉపాధ్యాయ వర్గాలను ఆయన కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, మల్లయ్య, నర్సింలుగౌడ్, అక్కారం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడే యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన పనిచేయాలని కోరారు. ప్రస్తుతం రైతులు నిత్యం యూరియా కోసం రోడ్డెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. ఎకరానికి ఒక బస్తా అనే నిబంధనలు లేకుండా పంటకు సరిపడా యూరియాను అందించాలని కోరారు. సీజన్ కంటే ముందే నానో యూరియా పట్ల ప్రతీ గ్రామంలో రైతులకు అర్థమయ్యేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి బిక్షపతి పాల్గొన్నారు.

యూరియా కొరత ఉందనడం అవాస్తవం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలయ్య

అక్కన్నపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి నియోజకవర్గంలో యూరియా కొరత ఉందని బీఆర్ఎస్ సొంత పత్రికలో తప్పుడు వార్తలు రాశారని, యూరియా కొరత ఉందనడం అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి యూరియా మొత్తం మంత్రి పొన్నం ప్రభాకర్ తన నియోజకవర్గానికి తీసుకువెళుతున్నారని చెబుతుంటే, ఆ పార్టీ పత్రికలో వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అక్కన్నపేట మండలంలో 32.4 టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు ముత్యాల సంజీవరెడ్డి, బద్దం రాజిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కరంటోతు రవి, నాయకులు ఉన్నారు.

తిగుల్‌లో బోనాల సందడి



రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రావణ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు.. పోతరాజుల ఆటపాటలు.. శివసత్తుల శిగాలతో ఊరేగింపు కొనసాగింది. గ్రామస్థులు ఉదయమే కొత్త కుండలకు పసుపు కుంకుమబొట్లు వేప కొమ్మలతో బోనాలను తయారుచేశారు.

మధ్యాహ్నం బోనాలను ఎత్తుకుని ఆటపాటలతో ఆడుతూ మహంకాళ్లమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శనివారం కావడంతో ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారిని వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు స్వామివారికి పంచామృత అభిషేకం, చందనార్చన నిర్వహించారు.

మైనంపల్లి దిష్టిబొమ్మ దహనం



వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద మైనంపల్లి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద శనివారం మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కొండపాక మండల యూత్ అధ్యక్షుడు వేముల బాబు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం లో వలసవాదులతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్ నియోజకవర్గంతో ఎటువంటి సంబంధం లేదన్నారు. అయినప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలోని కొంతమంది వ్యక్తులను కోవర్టులుగా పెట్టుకొని అశాంతిని ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే తన అనుచరులతో నర్సారెడ్డి ప్రతిష్టను దిగజార్చేందుకు కుల, మతాల పేరిట రాజకీయం చేస్తూ, కేసులు పెట్టిస్తూ బీఆర్ఎస్ నాయకులతో తొత్తుగా మారి నర్సారెడ్డిపై అనుచితంగా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మెరుగు ప్రభాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లికార్జున, మండల అధ్యక్షుడు త్రినేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూర్: సికింద్లాపూర్‌లో గత రాత్రి వర్షానికి కూలిన ఇల్లు

ముసురేసింది

(5వ పేజీ తరువాయి)

మండలంలో 14.0, అక్కన్నపేట 12.3, మిరుదొడ్డి 12.0, చిన్నకోడూర్ 11.5, తొగుట 10.8, దౌల్తాబాద్ 10.5, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల్లో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కడవేరుగు బ్రిడ్జిని పరిశీలించిన కలెక్టర్



చేర్యాల మండలంలోని కడవేరుగు బ్రిడ్జి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

చేర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులోని హైలెవల్ బ్రిడ్జిని కలెక్టర్ హైమావతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణం పనులు నిలిచిపోగా, వరద నీటి ప్రవాహ పరిస్థితులపై ఆరా తీశారు. వర్షాల నేపథ్యంలో పొరుగు గ్రామాల రాకపోకలతో పాటు బ్రిడ్జి ఆవరణలోని మట్టికుప్పల కారణంగా నెలకొన్న చిత్తడి తొలగింపునకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు దిలీప్‌నాయక్ ఉన్నారు.

అటకెక్కిన అప్‌గ్రేడేషన్

(5వ పేజీ తరువాయి)

ద్వారా మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయం సమకూరుతుంది. సిద్దిపేట మార్కెట్ కమిటీలో రూ.3.66 కోట్లు ఆదాయాన్ని ఆర్జించింది. హుస్నాబాద్ రూ.4.85 కోట్లు, గజ్వేల్ రూ.4.78 కోట్లు, చేర్యాల రూ.3.96 కోట్లు, వంటిమామిడి రూ.2.78 కోట్లు, బెజ్జంకి రూ.2.22 కోట్ల వరకు ఆర్జిస్తుండగా కోహెడ, దుబ్బాక రూ.2 కోట్ల వరకు, చిన్నకోడూరు, నంగునూరు, దౌల్తాబాద్, మిరుదొడ్డి, కొండపాక, తొగుట మార్కెట్ కమిటీల ఆదాయం రూ.2 కోట్లలోపే ఉంటుంది.

అప్‌గ్రేడ్‌తో పెరిగే ప్రయోజనాలు

జిల్లాలో ప్రస్తుతం సిద్దిపేట మార్కెట్ కమిటీ మాత్రమే స్పెషల్ గ్రేడ్‌లో ఉంది. గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మార్కెట్ కమిటీలు రూ.3.50 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జిస్తూ స్పెషల్ గ్రేడ్‌గా మారడానికి అర్హత సాధించాయి. అప్‌గ్రేడ్ అయితే సిబ్బంది సంఖ్యతో పాటు సౌకర్యాలు కూడా పెరుగుతాయి. ఇది మార్కెట్ కమిటీల పనితీరును మెరుగుపరుస్తుంది.

ఖాళీల భర్తీపై ప్రభుత్వానికి ఆసక్తి లేదు

మార్కెట్ కమిటీల్లో పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. సిద్దిపేట మార్కెట్ కమిటీలో స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ, సూపర్‌వైజర్, ఏఎంఎస్, ఎల్‌డీసీ, జేఎంఎస్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, వంటిమామిడి, కోహెడ, బెజ్జంకి, మిరుదొడ్డి, కొండపాక, దౌల్తాబాద్, నంగునూరు, చిన్నకోడూరు మార్కెట్లలోనూ అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 శాంక్షన్ పోస్టులకు గాను 32 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దాదాపు 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగి, తాత్కాలిక నియామకాలతో పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

జిల్లాలోని ఆయా మార్కెట్ కమిటీల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి నివేదికను గతంలోనే ప్రభుత్వానికి పంపించాం. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే.

- నాగరాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి

బెజ్జంకి క్రాసింగ్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

బెజ్జంకి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో శనివారం బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కేకే విరాట్ ఆస్పత్రి కరీంనగర్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అన్నా మేరీ, సుజాత, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ గురుకుల పేరెంట్స్ జిల్లా అధ్యక్షుడిగా తుమ్మ కృష్ణ



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుంచి నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

మర్కుక్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన తుమ్మ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీజేఆర్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో నియామకపత్రాన్ని ప్రధాన కార్యదర్శి శ్రీరాములు వెంకటేశ్వర్లు చేతులమీదుగా అందజేశారు. జిల్లాలోని వివిధ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



చిన్నకోడూరులో కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చిన్నకోడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) :ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలని కృష్ణస్వామి పోరాటం చేశారని, ఈ మేరకు ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాపయ్య, వెంకటేశం, శ్రీనివాస్, పెద్దులు, సతీష్, శంకర్, శ్రీనివాస్, తిరుపతి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా బాల్‌రాజు

జగదేవ్‌పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కందుల బాల్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలి భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పేర్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా బడెంగుల బాల్‌నర్సయ్య, కోశాధికారి మహమని యాదగిరి, ప్రధాన కార్యదర్శి దండె యాదగిరి, సహాయ కార్యదర్శి సుంకు కుమార్, ప్రచార కార్యదర్శి నార వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాబోయ్.. ఇదేం రోడ్డు?

- చిన్న వర్షానికే కేశవపూర్-యాటకార్లపల్లి రోడ్డు చిత్తడి
- గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు
- అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాలేని పరిస్థితులు
- మంత్రి పొన్నం దృష్టి సారించాలని వినతి



అక్కన్నపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని కేశవపూర్ నుండి యాటకార్లపల్లి వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం పడితేనే ఈ మట్టి రోడ్డు బురదమయంగా మారుతున్నది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈ గ్రామం నుంచి కేశవాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు, హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వివిధ శాఖలో పనిచేసే ఉద్యోగులు నిత్యం ప్రయాణిస్తుంటారు. వర్షం పడితే ఈ రోడ్డుపైన ప్రయాణించేందుకు నానా తంటాలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉండడంతో నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో ఇసుక మేటలు వేస్తున్నాయి. ఏదైనా అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ రావడానికి కూడా చాలా ఇబ్బందిగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

◀ గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారిన యాటకార్లపల్లి వెళ్లే రోడ్డు